

నేడు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన 'ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారం' అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను గురువారం నిర్వహించనున్నట్లు పర్యావరణ ఇంజినీర్ ఎస్.శంకర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ లైఫ్ (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్)లో భాగంగా నగరంలోని పిఎన్ కాలనీలో గల న్యూ సెంట్రల్ స్కూల్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. విజేతలకు ఈనెల ఐదో తేదీన బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు మోసం

- నాలుగేళ్లయినా హామీలు అమలు చేయని ప్రభుత్వం
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు
- ఇచ్ఛాపురంలో ప్రారంభమైన ప్రచారజాతా

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, ఇచ్ఛాపురం, పలాస, ఆమదాలవలస

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వారిని మోసం చేశారని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు విమర్శించారు. మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన చేపట్టిన ప్రచార జాతాను ఇచ్ఛాపురంలో జెండా ఊపి బుధవారం ఆయన ప్రారంభించారు. ఇచ్ఛాపురంలో ప్రారంభమైన జాతా పలాస-కాశీబుగ్గ, శ్రీకాకుళం మీదుగా ఆమదాలవలస చేరుకుని అక్కడితో జిల్లా పర్యటన ముగిసింది. జాతా ప్రారంభం సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం చెల్లించడానికి ప్రభుత్వానికి మనసు రావడం లేదన్నారు. ఆప్కాస్‌లో కార్మికులందరినీ ఉద్యోగులుగా నమోదు చేశారు, తప్ప ఉద్యోగులకు ఇచ్చే ఏ ఒక్క సౌకర్యాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచడం లేదన్నారు. అనేక మున్సిపాల్టీల్లో ఇఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా అమలు కావడం లేదని చెప్పారు. రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయన్నారు. తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, మాట నిలబెట్టుకోకుండా ఉద్యోగులను మోసం చేసిందన్నారు. కార్మికులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుంటే వచ్చే ఎన్నికల్లో వారు బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు, పిఎఫ్, ఇఎస్ఐను అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే ఇచ్ఛాపురం, సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి రెండు రాష్ట్ర ప్రచార జాతాలు చేపట్టామని చెప్పారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం విఫలమైందన్నారు. జాతాలో ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి ఎస్. జ్యోతిబసు, ఉపాధ్యక్షులు ఎన్.వై నాయుడు, రాష్ట్ర కార్యదర్శులు టి.నూకరాజు, టి.వెంకటరావు, నాయకులు జి.లక్ష్మి, బి.వరలక్ష్మి, జె.నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో ఫెడరేషన్ ఇచ్ఛాపురం ప్రధాన కార్యదర్శి రమేష్ పట్నాయక్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, ఫెడరేషన్ నాయకులు బి.కూర్మారావు, లోకనాథం, ఎ.గణేష్, యుగంధర్, తాడి సంతోష్, నీలాపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార జాతాలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు


90 పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్

- ఈ ఏడాది తొమ్మిదో తరగతి నుంచి ప్రారంభం
- తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో సిబిఎస్ఇ (సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్ అమలుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 90 పాఠశాలల్లో అమలు చేస్తోంది. ఈ ఏడాది తొమ్మిదో తరగతి నుంచి ప్రారంభించనుంది. తరగతుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. సిబిఎస్ఇ అనుబంధ గుర్తింపు పొందిన పాఠశాలల్లో తరగతులు నిర్వహించనున్నారు.

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సిబిఎస్ఇకి 90 పాఠశాలలు గుర్తింపు పొందాయి. 2023-24లో తొమ్మిదో తరగతి నుంచి సిబిఎస్ఇని అమలు చేస్తారు. ఈ విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు ఈ విధానంలో రాయనున్నారు. తొమ్మిదో తరగతికి ప్రవేశాలు నిర్వహించే విధానం, రిజిస్ట్రేషన్, విద్యార్థుల పరిశీలన, పరీక్షా విధానం, మూల్యాంకనం తదితర అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. రెండు బ్యాచ్‌లుగా నిర్వహించిన తర్ఫీదులో జిల్లా నుంచి శిక్షణ పొందిన నలుగురు, విశాఖ నుంచి ఇంకో ఇద్దరు రిసోర్స్‌పర్సన్లు హాజరై తరగతుల నిర్వహణకు తీసుకోవాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రతి ఏడాది గుర్తింపు విధానం పోర్టల్‌లో నవీకరణ ఎలా చేయాలి? పాఠశాలలు అకడమిక్ పొందే సహకారం, విద్యార్థులు చదవాల్సిన సబ్జెక్టులు, ఎన్ఇపిలో భాగంగా నైపుణ్యం, వృత్తి విద్యను నిర్వహించే పద్ధతులు, ఉపాధ్యాయులకు మాడ్యూల్స్ ఉపయోగించడంపై అవగాహన కల్పించారు.


పాఠ్య పుస్తకాల్లో మార్పులు

జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) పాఠ్య పుస్తకాలను సిబిఎస్ఇ అనుసరిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఈ సిలబస్ ఆధారంగా పుస్తకాలు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఏడాది ఎనిమిదో తరగతికి ఇదే సిలబస్ ఆధారంగా రూపొందించిన పుస్తకాలే ఇచ్చారు. వచ్చే ఏడాదికి తొమ్మిదో తరగతికీ ఈ విధానానికి అనుగుణంగా బుక్స్ తీసుకురానున్నారు. ఒకటి నుంచి ఏడు తరగతులకూ ఇవ్వాలని ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. గణితం, ఆంగ్లం, సామాన్య శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి కొత్తగా ఇస్తారు. సాంఘికశాస్త్రం రాష్ట్ర సిలబస్‌లో ఉంటుంది. అన్ని తరగతులకు సిబిఎస్ఇ పుస్తకాలు ఇచ్చినా, బోర్డు అనుమతి లేని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర బోర్డు పరీక్షలే రాయనున్నారని అధికారులు చెప్తున్నారు.

పోటీని ఎదుర్కొనేలా బోధన

సిబిఎస్ఇతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రస్తుత పోటీని ఎదుర్కొనే విధంగా తర్ఫీదు పొందుతాడు. సిలబస్ అర్థం చేసుకోవడం, వర్తమానంలో వచ్చే మార్పులను అన్వయించుకుని చదువుకుంటారు. ఎక్కడైనా విద్యార్థులు రాణించగలుగుతారు.

- ఎస్.తిరుమల చైతన్య
జిల్లా విద్యాశాఖ అధికారి

'స్పందన'లో జాప్యం వద్దు

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

స్పందన (జగనన్నకు చెబుదాం)కు వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. స్పందన కార్యక్రమంపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అర్జీదారులకు అధికారులు ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందనందునే అర్జీలు మళ్లీ ఓపెన్ అవుతున్నాయని తెలిపారు. సంతృప్తి చెందని అర్జీలు 17 ఉండగా, పున:ప్రారంభమైన అర్జీలు 13 ఉన్నాయన్నారు. స్పందన ద్వారా అర్జీదారుల సమస్యలకు పరిష్కారం లభించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవకులుగానే భావించాలని, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. స్పందనలో వచ్చే అర్జీలపై తక్షణమే స్పందించాలని కలెక్టర్ పలు సమావేశాలు నిర్వహించిన సంగతిని గుర్తుచేశారు. అయినా మొక్కుబడిగా అర్జీదారులకు సమాధానాలు ఇస్తూ సమస్యను దాటవేసే ప్రయత్నం కొందరు చేస్తున్నారని చెప్పారు. ఇకపై ఇలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్లు పక్కాగా ఉండాలని, అవి అప్‌లోడ్ చేసినప్పుడు స్పష్టంగా కనిపించేలా చూడాలని తెలిపారు. ఇందుకోసం అధికారులు, సిబ్బంది యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అర్జీలపై తీసుకున్న చర్యలపై ఫొటోలు ఉండాలని, అర్జీదారుడు సంతృప్తి చెందినట్లు స్పందన తీసుకోవాలన్నారు. వచ్చిన అర్జీల్లో పలు శాఖలతో సంబంధం ఉన్నప్పుడు పిఎంయు (ప్రాజెక్టు మోనటరింగ్ యూనిట్)తో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలి తప్ప శాఖల వారీగా దాటవేసే ప్రయత్నం చేయొద్దని సూచించారు. సమావేశంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీకృష్ణ, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, హౌసింగ్ పీడీ ఎన్.గణపతిరావు, ఆర్‌డిఒ బి.శాంతి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వి రమణ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

ఎఎస్‌పి తిప్పేస్వామి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్)గా జె.తిప్పేస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లాలో ట్రాఫిక్ డిఎస్‌పిగా పనిచేసిన ఉద్యోగోన్నతిపై ఎఎస్‌పిగా జిల్లాకు బదిలీ అయిన విషయం విదితమే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్‌పి జి.ఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిశారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న తిప్పేస్వామి

బదిలీపై వెళ్తున్న డిఎస్‌పికి సత్కారం

జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేసి విశాఖ ట్రాఫిక్ ఎడిసిపిగా బదిలీపై వెళ్తున్న జి.శ్రీనివాసరావును ఎస్‌పి జి.ఆర్ రాధిక ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళం మండలం తండేంవలసలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సన్మానించారు. ట్రైనింగ్ సెంటర్‌లో నిబద్ధత, అంకితభావంతో ఆయన పనిచేశారని ప్రశంసించారు. విశాఖలోనూ మంచి పేరు తెచ్చుకోవాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌ఇబి జెడి బి.నాగమణికంఠ, అదనపు ఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు వై.శృతి, బాలరాజు, డి.ప్రసాదరావు, సిఐ సన్యాసినాయుడు, ఆర్‌ఐలు బి.ప్రదీప్, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతుభరోసా

రైతుల ఖాతాల్లో రూ.236.66 కోట్లు జమ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

2023-24 సంవత్సరానికి మొదటి విడత రైతు భరోసా కింద ప్రభుత్వం రూ.236.66 కోట్లను వారి ఖాతాల్లో గురువారం జమ చేయనుంది. మొత్తం 3,15,544 మంది రైతులు ఈ పథకం కింద లబ్ధి పొందనున్నారు. శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో రైతులకు పంపిణీ చేయనున్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం మొదటి విడతగా మేలో రూ.7,500, రెండో విడతగా అక్టోబరులో రూ.4వేలు, మూడో విడతగా రూ.రెండు వేలు రైతుల ఖాతాల్లో వేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు 2019-20లో 3,34,057 మంది రైతులకు రూ.450.98 కోట్లను జమ చేసింది. 2020-21లో 3,80,901 మంది రైతులకు రూ.509.04 కోట్లను అందించింది. 2021-22లో 3,78,685 మంది రైతులకు రూ.525.62 కోట్లను జమ చేసింది. గతేడాది 3,10,346 మంది రైతుల ఖాతాల్లో 393.15 కోట్లు ఇచ్చింది.




రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - టెక్కలి

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజేశ్వరి విమర్శించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి పలుమార్లు సమస్యలను పరిష్కరించాలని కోరినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ధ్వజమెత్తారు. ఉద్యోగులపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై విసిగిపోయామన్నారు. ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయి పడిన డిఎలు, ఎరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐలకు రక్షణ కల్పించాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జాయింట్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.సూర్యనారాయణ, ఎన్.వెంకటరమణ, జె.శంకరరావు, బి.సుశీల తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి

త్వరితగతిన వసతి భవనాల నిర్మాణం

ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

వసతి భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌జియుకెటి, ట్రిపుల్ ఐటి ఛాన్సలర్ కె.సి.రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ట్రిపుల్ ఐటిని బుధవారం ఆయన సందర్శించారు. తాగునీరు, పరిశుభ్రత, హాస్టల్‌లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వసతి భవన నిర్మాణ పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదే సమయంలో నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సంబంధిత శాఖల ప్రతినిధులతో సమీక్షించి, చేపడుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ, ఎఫ్ఒ అసిరినాయుడు, యూనివర్సిటీ సివిల్ ఇంజినీర్ విభాగాధిపతి తేజ కిరణ్, సురేష్, పిఆర్ఒ మామిడి షణ్ముఖ పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజ లక్ష్యం

శ్రీకాకుళం : రానున్న వర్షాకాలంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీకాకుళం అర్బన్ వైద్యాధికారి జంపు కృష్ణమోహన్ అన్నారు. జిల్లా మలేరియా కన్సల్టెంట్ ఎల్.శ్రీకాంత్‌తో కలిసి శ్రీకాకుళంలో మలేరియా నిర్మూలన మాసోత్సవాల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగీ, మెదడువాపు, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు నుంచి కొంతవరకు కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. మలేరియా రహిత జిల్లాగా జిల్లాను తయారు చేసేందుకు ప్రజలు సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా డిఎంఒ ఎస్.శ్రీనివాసరావు, వైద్యారోగ్యశాఖ మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, కింజరాపు రవిప్రసాద్, మలేరియా కార్యాలయం సిబ్బంది జి.రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

అర్హతే ప్రామాణికంగా ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందన్నారు. అమరావతితో నిరుపేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తే చంద్రబాబునాయుడు అవహేళన చేస్తున్నారని విమర్శించారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా అడ్డుకునేందుకు కోర్టులను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో తట్టుకోలేక ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని చెప్పారు. చంద్రబాబు నాయుడుకు పరిపాలన చేతకాకపోవడం వల్లే జగన్మోహన్ రెడ్డికి గత ఎన్నికల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధిని చూసి టిడిపి నాయకులు తట్టుకోలేకపోతున్నారని చెప్పారు. అనంతరం మండలంలో ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లకు పురస్కారాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిడిఒ వై.విశ్వేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల, పట్టణ అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, గాడు నాగరాజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మి, వైస్ ఎంపిపి ప్రతినిధులు వండాన వెంకటరావు, కాకర్ల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగం ప్రాణాంతకం

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల ప్రాణాంతకమైన వ్యాధులు సంక్రమిస్తున్నాయని, కేన్సర్ వంటి రుగ్మతలకు పొగాకు వాడకమే ప్రధాన కారణమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యాన జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఏడు రోడ్ల జంక్షన్‌లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 60 రోజుల పాటు పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా వ్యూహాత్మక కార్యాచరణను ప్రకటించారు. ఇందులో భాగంగా ప్రతి విద్యాసంస్థను పొగాకు రహిత విద్యాసంస్థలుగా ప్రకటించనున్నామన్నారు. గ్రామాల్లో పొగాకు వినియోగాన్ని రూపుమాపే దిశగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సిగరెట్, పొగాకు ఉత్పత్తుల చట్టం- 2003 కఠినంగా అమలు చేయడం కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అనురాధ, ఎన్‌సిడి పిఒ శ్రీదేవి, డిపిఎంఒ కృష్ణమోహన్, డెమో పైడి వెంకటరమణ, సామాజిక సేవకుడు మంత్రి వెంకటస్వామి, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ఇండియన్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

జిల్లా అభివృద్ధి ప్రదాత రాజగోపాలరావు

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాజీ ఎంపీ కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించి, ప్రజల గుండెల్లో నిలిచిపోయారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యాన స్థానిక కొత్త రోడ్డు వద్ద రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార ప్రాజెక్టు నిర్మాణ ఆద్యుడు రాజగోపాలరావు అని కొనియాడారు. అయన జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మాట్లాడుతూ ఆరుసార్లు ఎంపీగా ఎన్నికైన ఆయన జిల్లా అభివృద్ధిలో తనదైన పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన్ను ఒక పార్టీకి చెందిన నాయకునిగా కాకుండా జిల్లా అభివృద్ధి ప్రదాతగా చూడాలన్నారు. శ్రీకాకుళాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయించి కేంద్ర ప్రభుత్వం వద్ద వెనుకబడిన జిల్లాగా గుర్తించి నిధుల మంజూరుకు కృషి చేశారని గుర్తుచేశారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడుతూ ఆమదాలవలసలో సహకార చక్కెర కర్మాగారం, నైర, రాగోలు, ఆమదాలవలసలో వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయించడంలో రాజగోపాలరావు పాత్ర ఎనలేనిదన్నారు. వ్యవసాయరంగానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి, టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, నాయకులు సింతు సుధాకర్, పి.ఎం.జె బాబు, శీర రమణయ్య, చిట్టి మోహన్, బలగ చెంగళరావు, ముద్దాడ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న రామ్మోహన్ నాయుడు తదితరులు

పారదర్శకంగా బదిలీలు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా పోలీసు శాఖలో నిబంధనల ప్రకారం పారదర్శకంగా బదిలీలు చేపట్టామని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో బదిలీల ప్రక్రియను బుధవారం చేపట్టారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లు, పలు విభాగాల్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా ఖాళీలను గుర్తించి, కోరిన వారికి నిబంధనల ప్రకారం పోస్టింగ్‌లు ఇచ్చారు. మొత్తం 164 మంది బదిలీ అయ్యారు. బదిలీల ప్రకియలో కమిటీ సభ్యులు ఎఎస్‌పి జె.తిప్పేస్వామి, డిఎస్‌పి నాగేశ్వరరెడ్డి ఉన్నారు.


బదిలీల ప్రకియను నిర్వహిస్తున్న ఎస్‌పి రాధిక, సభ్యులు



మెడల్స్‌ను అందజేస్తున్న వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య

ముగిసిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలోని వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు బుధవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ పోటీలకు జిల్లా నుంచి పలు ప్రాంతాలకు చెందిన 110 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలో 40 మంది విజేతలుగా నిలిచారని, వారు ఈ నెల 2 నుంచి 4 వరకు విజయనగరం జిల్లా కొత్తవలసలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తైక్వాండో జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్ తెలిపారు. అనంతరం విజేతలకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీ దివ్య మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో దాసరి రాజు, ఎల్.సి.రావు, బత్తిన కృష్ణయ్య, కాళ్ల దిలీప్ కుమార్, వల్లంపాటి శ్రీరామ్, పిలక విజయ్ పాల్గొన్నారు.

'శివశ్రీ నృత్య కళానికేతన్' కళాకారుల సత్తా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ కళాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఇటీవల సెంట్రల్ కల్చరల్ రిక్రూట్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యాన జాతీయ స్థాయి స్కాలర్ షిప్‌కు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కూచిపూడి విభాగంలో ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురు ఎంపికైనట్లు శివశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు రఘుపాత్రుని శ్రీకాంత్ తెలిపారు. కళానికేతన్ ద్వారా బూర్ల శ్రీకళ, దేవరశెట్టి ప్రణవి, కొమ్ము మోహిత్ కుమార్‌లు జాతీయ స్థాయికి ఎంపికయ్యారని వివరించారు. సిసిఆర్ టి స్కాలర్ షిప్‌కు జాతీయస్థాయిలో కూచిపూడి విభాగంలో 1600 మంది కళాకారులు పోటీ పడగా, ఉత్తరాంధ్ర నుంచి కళానికేతన్‌కు చెందిన ముగ్గురు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఏటా 14 ఏళ్లలోపు బాలబాలికలకు ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపిక అవుతున్నారని అన్నారు. ఏడాదికి రూ.9 వేలు వంతున ఐదేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందజేస్తారని అన్నారు. స్కాలర్‌షిప్‌కు వారికి పోస్టల్ ద్వారా ధ్రువపత్రాలను అందజేస్తారని వివరించారు.

7లోగా ఆన్‌లైన్ చేసుకోవాలి

పోలాకి : ఎపి మోడల్ జూనియర్ కాలేజ్ ఈదులవలసలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 7లోగా ఆన్‌లైన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎంపిటిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి ఇంగ్లీష్ మీడియం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9949245179, 8008282009 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

సంతకాలు ఫుల్... కౌన్సిలర్లు నిల్

మమ అనిపించిన మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి- పలాస

మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సమావేశానికి కౌన్సిలర్లు డుమ్మాకొట్టారు. సమావేశానికి వచ్చిన కౌన్సిలర్లు మినిట్ బుక్‌లో సంతకాలు చేసి వెనుదిరిగారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి, పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలపై, వసతులపై చర్చ జరగాల్సి ఉంది. ఈ నెలా మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు పూర్తిస్థాయిలో ఉండకపోవడంతో మమా అనిపించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 15 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. అప్పటికే 31 మంది వార్డు కౌన్సిలర్లు, ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులు హాజరు కావాల్సి ఉంది. కానీ, కేవలం 10 మంది కౌన్సిలర్లతో పాటు ఒక కో-ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు ఉన్నారు. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లుతో పాటు టిడిపి కౌన్సిలర్లు సమావేశం మినిట్ బుక్‌లో సంతకాలు చేసి వెనుదిరిగారు. దీంతో సమావేశంలో ఉన్న కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. వైసిపి కౌన్సిలర్లు బడగల సుజాత, పోతనపల్లి ఉమా కుమారి, జోగ సతీష్ తదితరులు సమావేశం ప్రారంభం కాకముందే వెళ్లిపోవడంతో చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా గత సమావేశంలో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు అయినప్పటికీ అభివృద్ధి పనులు చేపట్టడంలేదని, పనులు చేపట్టకపోతే మున్సిపల్ సమావేశానికి హాజరు కామని, అవసరమైతే తమ కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేస్తానని గత సమావేశంలో అధికారులను హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఈ సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు కూడా హాజరు కాలేదు. ఈ విషయంపై మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ సీతారాంను వివరణ కోరగా కొంత మంది కౌన్సిలర్లు తమకు పనులు ఉన్నాయని చెప్పి వెళ్లిపోయారని తెలిపారు.


ఖాళీగా ఉన్న కుర్చీలు


మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

తూతూమంత్రంగా చర్చ

మున్సిపల్ సమావేశం తూతూ మంత్రంగా సాగింది. కేవలం ముగ్గురు కౌన్సిలర్లు తమ వార్డు సమస్యలపై చర్చించారు. మున్సిపల్ విప్ దుర్గా శంకర్ పండా మాట్లాడుతూ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు ఎందుకు వేతనాలు చెల్లించడం లేదని, వారు సమ్మెకు దిగితే మున్సిపాలిటీ పారిశుధ్యం పేరుకుతుందని అన్నారు. వారికి తక్షణమే జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఒకే వార్డుకు పదుల సంఖ్యలో లక్షలు వ్యయంతో పనులు చేపట్టడం బాగులేదని, అన్నీ వార్డులకూ ఎంతో కొంత నిధులు కేటాయిస్తే కౌన్సిలర్లు ఆనందిస్తారని అన్నారు. వెంకటేశ్వర కాలనీ, ఆర్అండ్‌బి అతిథి గృహం ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై మున్సిపల్ చైర్మన్ గిరిబాబు స్పందిస్తూ అంతర్గడ్డ ప్రాంతంలో బిటి రోడ్డు, సిసి రోడ్లు వేయడానికి రూ.35 లక్షలు వెచ్చించామని తెలిపారు. కౌన్సిలర్ బోర చంద్రకళ మాట్లాడుతూ పలాసలో ఈనెల 11, 12, 13 తేదీల్లో గ్రామ దేవత ఉత్సవాలు జరగనున్నాయని, తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నెలలు గడుస్తున్నా పవర్ బోర్ పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. తక్షణమే తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, మున్సిపల్ డిఇఇ బల్ల హరి, మున్సిపల్ ఎఇఇ అవినాష్ పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలంపాటకు ఆమోదం


మాట్లాడుతున్న మున్సిపల్ న్యాయవాది నారాయణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలోని చేపల చెరువులు బహిరంగ వేలం వేయడానికి కౌన్సెల్ ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం కౌన్సెల్ సాధారణ సమావేశం నిర్వహించారు. గత సమావేశాల నుంచి ఈ చేపల చెరువులు లీజు విషయంపై కౌన్సెల్ సమావేశంలో ఘర్షణ, వాగ్వివాదం చోటుచేసుకొని వాయిదా పడుతూ వచ్చింది. చివరికి బుధవారం నిర్వహించిన సాధారణ సమావేశంలో ఈ అంశంపై మున్సిపల్ స్టాండింగ్ కౌన్సెల్ న్యాయవాది ఎస్.ఎల్.నారాయన చైర్‌పర్సన్ అభ్యర్థన మేరకు చేపల చెరువులు లీజుపై న్యాయ పరమైన సలహా ఇచ్చారు. దీంతో కౌన్సెల్ ఏకగ్రీవంగా బహిరంగ వేలం వేయడానికి తీర్మానించింది. పట్టణంలో అనేక మంది ఇంటి కుళాయి పన్ను చెల్లిస్తున్నా మరోసారి కట్టమని నోటీసులు ఇస్తున్నారని వార్డు కౌన్సిలర్ ఆసీ లీలారాణి అన్నారు. కుళాయి పన్ను చెల్లిస్తున్నా మరోసారి రావడంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. కొత్తగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించే ముందు కౌన్సెల్ సభ్యులకు మర్యాదపూర్వకంగా కలవాల్సిన బాధ్యత ఉందా? లేదా అని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. జాయినింగ్ ఆర్డరు తీసుకునే ముందు కౌన్సెల్ సభ్యులకు కలవమని చెప్పామని మున్సిపల్ కమిషనర్ రమేష్ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగంపై ప్రత్యక సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారని, ఇంకా ఎందుకు పెట్టలేదని వార్డు కౌన్సిలర్ లీలారాణి ప్రశ్నించారు. కమిషనర్ రమేష్ సమధానం ఇస్తూ... ఇంకా గైడ్‌లైన్స్ రాలేదని, వచ్చిన వెంటేనే సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. చెరువుల్లో మట్టి, ముళ్ల పొదలు తొలగింపు ఎంత వరకు జరిగింది, వాటి వివరాలు కౌన్సెల్ సభ్యులకు అందజేయాలని వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి కోరారు. ఇటీవల నిర్వహించిన గ్రామ దేవత సంబరాలు సందర్భంగా పట్టణంలో బస్ స్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి గేట్ తొలగింపు జాప్యమవుతుందని వార్డు కౌన్సిలర్ బుచ్చ జగన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గేటు తొలగింపు బాధ్యత ఆలయ అభివృద్ధి కమిటీకే చెందుందని, మరోసారి మున్సిపల్ పరంగా గుర్తు చేస్తామని కమిషనర్ తెలిపారు. మూడో వార్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ పత్రీ తవిటియ్య సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్, సాలీనా ఢిల్లీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు


హేమంత్ (ఫైల్)

మండలంలోని బాతుపురం పంచాయతీ పెదవంకకు చెందిన క్రికెట్ క్రీడాకారుడు ఇరోతు హేమంత్ అలియాస్ నాగ (23) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హేమంత్ ఆదివారం నుంచి కనిపించక పోవడంతో తండ్రి ఇరోతు వీరాస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం బాతుపురం గ్రామ సమీపంలోని జీడి తోటలో ఉరి వేసుకొని వేలాడుతూ ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం ముఖం పూర్తిగా యాసిడ్ పోసి కాలినట్లు, చెట్టు కొమ్మకు వేలాడితే కాళ్లు భూమికి తగిలినట్లు ఉండడంతో అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ మధుసూదనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

టెక్కలి రూరల్ : టెక్కలి మండలంలోని గంగాధరపేటకు చెందిన బమ్మిడి లక్ష్మణరావు మే నెల 26న ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టెక్కలిలోని జెడ్‌పి రోడ్డులో ఓ దుకాణం వద్ద లక్ష్మణరావు ఆస్తి తగాదాల్లో తన సమీప బంధువుతో వాగ్వివాదం పడ్డాడు. సొంత బంధువులే తనకు అన్యాయం చేస్తున్నారన్న మనస్థాపనానికి గురయ్యాడు. దీంతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు క్షతగ్రాత్రుడిని విశాఖలోని ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తా పడిన లారీ

లారీ బోల్తా

నందిగాం : మండలంలోని ఆకుల రఘునాథపురం వద్ద జాతీయ రహదారి నుంచి చండమ్మ గెడ్డ పిల్ల కాలువలో బుధవారం లారీ బోల్తా పడింది. భువనేశ్వర్ నుంచి బెంగుళూరు వెళ్తున్న లారీ ఒక్కసారిగా పక్కకు ఒరిగి బల్తా పడింది. లారీలో డ్రైవర్, క్లీనర్ ఉన్నారు. వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

'ఐతమ్' అధ్యాపకులకు డాక్టరేట్


కవిత

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఐటి విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న కాపల కవితకు నాగార్జున ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పిహెచ్‌డి పట్టాను మంజూరు చేసిందని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ సునీత చిట్టినేని మార్గదర్శకత్వంతో ఏ డిజైన్ ఆఫ్ సర్కస్సం సెంటిమెంట్ డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ మోడల్ యూజింగ్ డిపి లెర్నింగ్ టెక్నిక్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ పిహెచ్‌డి పట్టాను మంజూరు చేసిందన్నారు. కవిత కాపలా పిహెచ్‌డి పట్టాను సంపాదించడంపై డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, టీం కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.ఆజాద్, ఐటిపిహెచ్‌డి డాక్టర్ వై.రమేష్ అధ్యాపకులు సిబ్బంది అభినందించారు.

'పెళ్లి కానుక' అందజేత


పెళ్లి కానుకను అందిస్తున్న సభ్యులు

కవిటి: మండలంలోని పెద్దమెళియాపుట్టుగకు చెందిన సరస్వతికి మండలానికి చెందిన జైహింద్ సేవా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ పెళ్లికానుక అందించి తన ఉదారత చాటుకుంది. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన సరస్వతికి ఇటీవల పెళ్లి నిశ్చయించారు. అయితే ఆమె ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అని తెలుసుకున్న జైహింద్ ఫౌండేషన్ సభ్యులు బుధవారం గ్రామానికి చేరుకుని తమ సేవా సంస్థ తరపున రూ.11,111లు, రెండు చీరలు, పసుపు, కుంకుమను సరస్వతికి పెళ్లి కానుకగా అందించారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, జైహింద్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉత్సవాలకు గౌతు శిరీషకు ఆహ్వానం


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

పలాస : మండలంలోని కిష్టుపురంలో ఈ నెల 4,5,6 తేదీల్లో నిర్వహించనున్న బాడపోలమ్మ గ్రామదేవత ఉత్సవాలకు గ్రామ కమిటీ సభ్యులు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీషకు ఆహ్వానం పలికారు. ఈ మేరకు టిడిపి కార్యాలయానికి బుధవారం వెళ్లి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. పూర్వీకుల నుంచి నిర్వహిస్తున్న ఉత్సవాలకు రావాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణంరాజు, నాగరాజు, ఢిల్లీ, ఎం.ఆనంద్, నారాయణరావు, రెల్ల రాజు, రాజేష్ పాల్గొన్నారు.

అన్ని సంఘాలూ ఎ-గ్రేడ్‌లో ఉండాలి

ఆమదాలవలస : మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉన్న మహిళా స్వయం శక్తి సంఘాలన్నీ ఎ-గ్రేడ్‌లో ఉండేటట్లు సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని మండల మహిళా సమాఖ్య ప్రెసిడెంట్ తమ్మినేని ధనలక్ష్మి సూచించారు. పట్టణంలోని మండల సమాఖ్యలో ఎపిఎం పైడి కూర్మారావు అధ్యక్షతన విఒఎలతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యులు అవసరం మేరకు పొదుపులో నుంచి అంతర్గత రుణాలు వాడుకోవాలన్నారు. వాయిదాల ప్రకారం తిరిగి సక్రమంగా చెల్లించుకోవాలన్నారు. పుస్తక నిర్వహణ ఎప్పటికప్పుడు జరిగేలా సంబంధిత విఒఎలు, సిసిలు బాధ్యత వహించాలన్నారు.

తాగునీటి కల్పనకు ప్రాధాన్యం


ప్రారంభిస్తున్న నాయకులు

సోంపేట: గ్రామాల్లో తాగునీటి కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు, సర్పంచ్ నగిరి ప్రభావతి తెలిపారు. పట్నంలోని మంగళ వీధి, గాంధీనగర్ వీధుల్లో రోటరీ క్లబ్, గ్రామ పంచాయతీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంకులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు, వైస్ సర్పంచ్ వెంకటరమణ, కె.తిరుపతి, యుగంధర్, లక్ష్మి, జానకి నెహ్రూ, శంకరరావు, రాజులమ్మ పాల్గొన్నారు.

బారువ ఎస్ఐగా చిరంజీవి

సోంపేట : బారువ ఎస్ఐగా చిరంజీవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సత్యనారాయణ పోలాకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కంచిలి నుంచి చిరంజీవి ఇక్కడకు బదిలీపై వచ్చారు. చిరంజీవికి స్టేషన్ సిబ్బంది సాదర స్వాగతం పలికారు.

పోలాకి ఎస్ఐగా సత్యనారాయణ

పోలాకి: పోలాకి పోలీస్‌స్టేషన్‌కు కొత్త ఎస్ఐగా వి.సత్యనారాయణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నరసింహమూర్తి బదిలీపై పార్వతీపురం వెళ్లారు. బారువలో విధులు నిర్వహిస్తూ... ఇక్కడకు బదిలీపై వచ్చారు.

వే బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలన

మెళియాపుట్టి : మండల కేంద్రంలోని సివిల్ సప్లయి గోదాముల వద్ద నిర్మిస్తున్న వే బ్రిడ్జి పనులను తహశీల్దార్ పి.సరోజని బుధవారం పరిశీలించారు. పనులు త్వరితగతిన చేపట్టాలని సివిల్ సప్లయి అధికారులను ఆదేశించారు. ఈమెతో పాటు ఆర్ఐ వైకుంఠరావు, విఆర్ఒ ఉన్నారు.

సహకార బ్యాంకు సేవలు విస్తృతం


మాట్లాడుతున్న రాఘవేంద్రరావు

పలాస: వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకులు సేవలు అందిస్తున్నాయని, వాటికి ప్రతి ఒక్కరూ చేరువ కావాలని విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. పలాస బ్రాంచ్ సభ్యులు నిర్వహించిన మహాసభలో బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక సామరస్యానికి ఎటువంటి విఘాతం కలగకుండా సహకార సిద్ధాంతాల నీడలో ప్రయాణం చేయగలిగితే ఉతమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. బ్యాంకు సభ్యులకు, వారి కుటుంబ సభ్యులకు దేశంలోని ఏ సహకార బ్యాంకులోను అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. సేవింగ్ ఖాతాల్లోని నిల్వలపై రోజు వారి లెక్కింపు ప్రాతిపదికన ఐదు శాతం వడ్డీ చెల్లిస్తున్న బ్యాంకు కేవలం విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు మాత్రమేనని అన్నారు. పలాస బ్యాంకుని 29వ బ్రాంచ్‌గా ఏర్పాటు చేసుకున్నామని, 31 మార్చి 2023 నాటికి పదేళ్ల సేవా కాలాన్ని పూర్తి చేసుకున్నామని అన్నారు. బ్రాంచ్ సిబ్బంది సంప్రదింపుల కమిటీ సభ్యులు, డైరెక్టర్ల సహకారంతో డిపాజిట్లు సేకరణ, రుణాల జారికి కృషి చేస్తున్నామని అన్నారు. తనఖా రుణాలు వాయిదాలను సక్రమంగా చెల్లిస్తే చెల్లించిన వడ్డీలో 4 శాతం నగదు ప్రోత్సహకంగా ఇస్తున్నామన్నారు. మార్చి 31 నాటికి బ్యాంకు డిపాజిట్లు సేకరణ రూ.5.52 కోట్లు కాగా, రుణాలు మంజూరు రూ.16.56 కోట్లుగా ఉందన్నారు. అనంతరం బ్రాంచ్‌లో సీనియర్ సభ్యులుగా ఉన్న వడ్డీ దశరథరావు, కె.కొండలరావు, కొత్తపల్లి రమేష్ ఆచారిలను ఘనంగా సన్మానించారు. డైరెక్టర్ చెరువు ఆదినారాయణ శాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో బ్యాంకు డైరెక్టర్లు ఉప్పరపాటి పార్వతీదేవి, కండాపు ప్రసాదరావు, రామకృష్ణ, జోనల్ మేనేజర్ రమణమూర్తి, పలాస బ్రాంచ్ మేనేజర్ సింహాద్రి క్రాంతి నాయక్, దుర్గారావు, భరత్, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలి

టెక్కలి : సాంకేతికతను అందిపుచ్చుకునే క్రమంలో భాగంగా కొత్తగా విడుదలైన సినిమా విడుదలైన మొదటి రోజునే ఇంట్లో వీక్షించేందుకు వీలుగా ఎపి ఫైబర్‌నెట్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి తీసుకునే నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలని స్థానిక సుదర్శన థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ ఒక ప్రకటనలో కోరారు. ఫైబర్ నెట్ వినియోగం విస్తరించేందుకు అనేక మార్గాలను ప్రభుత్వం వినియోగించుకోవడం హర్షణీయమన్నారు. కానీ, ప్రేక్షకులకు వినోదాన్ని, మానసిక ఆనందాన్ని అందించే సినిమాలపై తీసుకునే నిర్ణయం సమంజసం కాదన్నారు. గౌతంరెడ్డి తీసుకునే నిర్ణయం వల్ల నిర్మాతకు, వీక్షంచే ప్రేక్షకునికి లాభం కలిగేది హర్షణీయమన్నారు. అయినా ఈ విధానం వల్ల సినిమా థియేటర్ల యాజమానులు తీవ్రంగా నష్టానికి గురవుతారని అన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సినిమా థియేటర్లను నిర్మించామని, అటువంటి థియేటర్‌కు ప్రేక్షకుడు దూరమైతే తాము నష్టాలకు గురవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఒటిటి, ఐబొమ్మ, విధానం ద్వారా సినిమాలు విడుదల అవుతుండడంతో ప్రేక్షకులు సినిమా థియేటర్ల దూరమయ్యారని అన్నారు. గౌతంరెడ్డి తీసుకునే నిర్ణయంపై పునరాలోచించుకోవాలని కోరారు.


కూలీలతో మాట్లాడుతున్న రాధాకుమారి

'ఉపాధి'లో అక్రమాలపై దర్యాప్తు

బూర్జ : మండలంలోని అన్నంపేటలో ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని జాబ్ కార్డుదారుడు పరిటాల రవి మే నెల 22న స్పందన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి సమగ్ర దర్యాప్తు చేపట్టి నివేదిక అందజేయాలని అసిస్టెంట్ పీడీ రాధాకుమారికి ఆదేశించారు. ఈ మేరకు అన్నంపేటలో ఉపాధి పనుల వద్ద కూలీలతో బుధవారం మాట్లాడి దర్యాప్తు చేపట్టారు. ప్రతి కూలీ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒకరి పేరున మరొకరు, ప్రభుత్వ ఉద్యోగులకు, పెళ్లి వెళ్లిపోయిన వారి పేరున జాబ్‌కార్డులు ఉన్నాయని ఆమె దృష్టికి కూలీలు తీసుకొచ్చారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని రాధాకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ రాజ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కట్యాచార్యులపేటలో అన్నదానం

ఆమదాలవలస : మండలంలోని కట్యాచార్యులపేటలో వీర హనుమాన్ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు అధ్యక్షతన బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానానికి చీమలవలస, హనుమంతపురం, వెదుళ్లవలస, బొబ్బిలిపేట గ్రామాలను అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. సాయంత్రం గ్రామంలో స్వామివారి విగ్రహాలను ఊరేగించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- జలుమూరు

విత్తన డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా నిఘా, విజిలెన్స్ విభాగం ఎస్ఐ అశోక్ చక్రవర్తి, ఎఇ రవి కిషోర్‌లు హెచ్చరించారు. మండలంలోని చల్లబానిపేట కూడలిలో ఉన్న లక్ష్మీ ట్రేడర్స్, పొట్నూరు చంద్రభూషణరావు ఇన్‌పుట్ డీలర్ షాపులను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన స్టాక్ రికార్డులు, విత్తన నిల్వలను తనిఖీ చేశారు. విత్తన కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ రసీదు ఇవ్వాలని ఆదేశించారు. బిల్‌బుక్ పైన రైతుల సంతకాలు కచ్చితంగా తీసుకోవాలని సూచించారు. అలాగే అందరికీ కనిపించే విధంగా విత్తన ధరల పట్టికను వేలాడదీయాలన్నారు. ప్రతి లాట్ మొలక శాతం కట్టాలని ఆదేశించారు. ఈ నిబంధనను ఉల్లంఘించిన డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. వీరితో పాటు మండల వ్యవసాయ అధికారి కె.సురేష్ ఉన్నారు.

పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ

కవిటి : విశాఖ డెయిరీ ఆధ్వర్యాన మండలంలోని ముత్యాలపేటలో 50 మంది పాడి రైతులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ సూపర్ వైజర్ కె.జి.వి.ప్రసాద్ మాట్లాడుతూ ఇచ్ఛాపురం బిసిసి పరిధిలోని 36 గ్రామాల్లో సుఖీభవ కార్డు కలిగిన 1486 మంది పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఆరింగి వెంకటరావు, విశాఖ డెయిరీ ఏజెంట్ ఎస్.మహేశ్వరరావు, కార్యదర్శి శంకర్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు


మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రమణమూర్తి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని బొబ్బిలిపేట తాగునీటి బోర్లకు సర్పంచ్ గొండు రమణమూర్తి ఆధ్వర్యాన బుధవారం మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. గ్రామంలోని చాకలి వీధి, చింతాడ రామారావు ఇంటి సమీపంలో ఉన్న రెండు తాగునీటి బోర్లు మొరాయించడంతో సర్పంచ్ దృష్టికి తీసుకొచ్చారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీరుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో సర్పంచ్ బోర్ల మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బి.పూర్ణిమ, ఏడో వార్డు మెంబరు చింతాడ అప్పారావు, బోర్ మెకానిక్ పప్పల చంద్రరావు పాల్గొన్నారు.

వాలంటీర్లు సంక్షేమ సారథులు

కోటబొమ్మాళి: ఒకటో తేదీన వృద్ధులు, వికలాంగులు ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందించడంతో పాటు ప్రతి ప్రభుత్వ పథకాలనూ లబ్ధిదారులు చేరవేస్తున్న వాలంటీర్లు సంక్షేమ సారథులని ఎంపిపి రోణింకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు అన్నారు. వాలంటీర్లకు వందనం కార్యాక్రమంలో భాగంగా మండలంలోని జర్జంగి, కస్తూరిపాడు, దుప్పలపా డు, విశ్వనాథపురం గ్రామ సచివాలయాల వాలంటీర్లకు సేవా పత్రాలు అందజేసి సన్మానించారు. సర్పంచ్‌లు అన్నెపు రామారావు, గురువెల్లి సూర్యప్రకాష్, పేడాడ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు సంపతిరావు హేమసుందరరాజు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న నాయకులు

మహేశ్వరమ్మ ఆలయంలో చోరీ


పగులగొట్టిన హుండీ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ గాంధీ నగర్ మహేశ్వరమ్మ ఆలయంలో బుధవారం చోరీ జరిగింది. ఆలయంలో ఉన్న హుండీ పగులకొట్టి అందులో ఉన్న డబ్బులను దోచుకున్నారు. గాంధీ నగర్‌లో ఉన్న మహేశ్వరమ్మ ఆలయంలో ఎన్.బాబూరావు భార్య ప్రభ పూజారిగా పనిచేస్తున్నారు. రోజులానే బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో అమ్మవారి ఆలయం తెరిచేందుకు వచ్చారు. ఆలయం తలుపులు తెరిచి ఉండడం, ఆలయంలో ఉన్న హుండీ లేకపోవడం చూసి కేకలు చేసింది. దీంతో చుట్టు పక్కల ప్రజలు ఆలయం వద్దకు చేరుకొని ఆలయం అంతా చూసే సరికి ఆరు తాళాలు పగల కొట్టారు. హుండీ సమీపంలో పారవేసి అందులో డబ్బులు పట్టుకుపోయారు. అయితే సుమారు రెండు నెలల క్రితం అమ్మవారి బంగారపు ఆభరణాలు బ్యాంకు లాకర్‌లో వేశామని పూజారి తెలిపారు. ఈ నెల 13న అమ్మవారి చల్లదనం కార్యక్రమం ఉండడంతో ఆలయానికి రంగులు వేసేందుకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో గత ఆరు నెలలుగా హుండీలో డబ్బులు తీయలేదని చెప్పారు. సుమారు రూ.30 వేలు నగదు ఉంటుందన్నారు. ఇంతలో ఆలయంలో దొంగలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు ఆలయాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పరిశీలిస్తున్న సతీష్

'ఉపాధి' పనులు పరిశీలన

జి.సిగడాం : జి.సిగడాం బారికివాని చెరువులో ఇటీవల చేపట్టిన ఉపాధి హామీ పనులను సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్ బుధవారం పరిశీలించారు. మండలంలోని ఉపాధి హామీ పనులు ఎలా చేస్తున్నారని ఎపిఒ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్ ఆఫీసర్లు, మేట్లు పనుల్లో నాణ్యత గట్టు బలపరచడం గురించి అడిగారు. కొతల ప్రకారం పనులు చేయించి రోజుకు రూ.272 కూలి తగ్గకుండా వచ్చేట్టు పనులు చేయించాలన్నారు. ఉపాధి హామీ ద్వారా చేస్తున్న పనుల్లో ప్రయోజనాలు క్షేత్రస్థాయి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎపిడి లోకేష్, పొందూరు ఎపిఒ శ్రీనివాస్, ఇసిలు పురుషోత్తం, సందీప్ పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని టెక్కలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని అయోధ్యాపురం పంచాయతీ బన్నువాడలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, సర్పంచ్ పోలాకి మోహనరావు, ఎంపిటిసి పోలాకి షణ్ముఖరావు, సర్పంచ్‌లు బగాది హరి, గుజ్జు మోహన్‌రెడ్డి, కె.కామేశ్వరరావు, రౌతు జయమోహన్, సంజీవరావు, శ్రీనివాసరావు, ఎ.రవి పాల్గొన్నారు.